# పోలింగుడ్యూటీ

శ్రీ పండితారాధ్యుల పరంధామయ్య

ఆచార్యులవారు చెయ్యివిరిగిన కుర్చీలో కూర్చొని తన తరగతికి సహారా యెడారిని గురించి పాఠం చెపుతున్నాడు. కాని అతని మనసేమీ బాగాలేదు. ఏదో తెలియని బాధ అతని కంఠాన్ని నొక్కినట్టు ఫీలు గావటం-ఆటోమాటిక్‌గా అతని వాక్ ప్రవాహం ఆగిపోవటం జరుగుతూ వుంది. పంతులుగారు అన్యమనస్కులు గావటంతోటి పిల్లలు వొకరినొకరు గిల్లుకుంటూ - తోసుకుంటూ అల్లరి ప్రారంభించారు. కాని ఆచార్యులవారు ఈ బడి హద్దులు దాటి చాలా దూరం వెళ్లాడు.

“నా జీవితం కూడా ఈ ఎడారిమాదిరిగానే వుంది. సహారాలో ఒయసిస్సులన్నా వున్నాయి. కాని నా జీవితంలో సుఖపడ్డ సమయం ఒకటి కూడా లేదు. మూలిగేనక్కపై తాటికాయ పడ్డట్టు యీ పోలింగు డ్యూటి ఒకటి - తాను కొంప దగ్గరుంటేనే ఈ కష్టపు రోజుల్లో గడవటం అంతంత మాత్రంగా వుంది. ఏంచేస్తాం - పోవాలి ఎలెక్షను. అర్జెంటు అని వుండెనే. పోయి తీరాలి. సాయంత్రంలోగా ఎక్కడున్నా బియ్యపు నూకలు సంపాదించాలి. సరే! ఏలాగో సంపాదిస్తాం. చార్జికి డబ్బులెట్లా! ఏలాగో చార్జి డబ్బులు సంపాదించినా అక్కడెవరు ధర్మతిండి పెడతారు. తిండికి చావాల్సిందేనా? పోలింగు డ్యూటికి పోవాలంటే కనీసం పదిరూపాయలన్నా వుండాలి. కాని తన చేతిలో పదిదమ్మిడీలు కూడా లేవు. ఎవరి నడుగుదాం ఎవరిస్తారు.” ఆచార్యులవారు క్రుంగిపోయారు. నీరసంతో కుర్చీయొక్క విరిగిన చేతిపై తన శరీరభారాన్ని కొంచెం వేస్తూ వెనక్కి జేరగిలబడ్డాడు. మరుక్షణంలో కుర్చీ చేయిపీడి క్రిందబడటం - క్రిందబడే వూపును తాను తట్టుకోటం - ఒక్కసారే జరిగాయి. దాంతో తాను తన క్లాసులో తన కుర్చీలో వున్నట్టు - పిల్లలు గలభా చేస్తున్నట్టు ఒక్క త్రుటిలో ఆచార్యులవారు గ్రహించగలిగారు. అతనికి ముచ్చెమటలు పోసినై. తనపై - యెప్పుడూ చాడీలు చెప్పే గురవయ్య హెచ్ - యమ్ దగ్గరికి పోయి వుండడుగదా! ధూత్ అంటూ కుర్చీలోనుంచి యెగిరి బెత్తాన్ని ఝళిపిస్తూ - గగ్గయ్యపోజ్‌లో పిల్లలపైకి పోయాడు. పంతులుగారు వున్నట్టుండి ఉగ్రనరసింహావతారాన్ని దాల్చటం పిల్లలకు కించిత్తు భయాన్నే కలిగించినా - అంతో యింతో వింతనుకూడా సృష్టించింది. “వెధవల్లారా నే నుండగానే అల్లరి”- “వీడు గిల్లాడు సార్’ - “వీడు మొట్టాడు సార్.” మరల గలభా - “ఛట్ - నోరుమూయండి. పలకలు తీసుకొని - సహారా యెడారిని గురించి పదిమాటలు వ్రాయండి - ఊ - తీసుకోండి - క్విక్.”

“పలకలమీదనా? పుస్తకాలమీదనా సార్?”

“సహారా అంటే ఒంటెనుగురించి గదా సార్?”

“సైలెన్స్ - వుత్తవెధవలు నోరుమూసుకొని వ్రాయండి - సహారా యెడారిఅంటే యేమనుకున్నారు? ఒక పెద్ద యిసుక మైదానము - చెట్టు - చేమా - నీరూ - పశువులూ - యెక్కడా వుండవ్. అక్కడక్కడా ఒయసిస్సులుంటాయ్. కొంతమంది గుడారాల్లో అక్కడే కాపురముంటారు. మనం తినే ఖర్జూరం అక్కడ పండుతుంది. ఒంటెలమీద ప్రయాణం మొదలైన విషయాలు వ్రాయండి. ఊ - త్వరగా -”

పంతులుగారు కుర్చీని మరమ్మతుచేసి కూర్చొని మరల తన ఆలోచనలలో మునిగిపోయారు. ఇంతలో బెల్ అయింది. ఆచార్యులవారు కూడా మేల్కొని యింటికి బయలుదేరారు. దారిలో వారి కింకొక సందేహం వొచ్చింది. పోలింగ్ డ్యూటీకి వెళ్లేటప్పుడు కొంచెం శుభ్రమైన బట్టలు వేసుకొని వెళ్లాలి. చాకలివాడు తెచ్చాడో లేదో? లేకుంటే యీ జీర్ణవస్త్రధారణే శరణ్యమా! ఆచార్యులవారు తన దుస్తుల వైపు దీనంగా చూచుకొని ఒక నిట్టూర్పు విడిచాడు. వీధి అంచునే - మొండిగోడల ప్రక్కగా - కాళ్ళీడ్చుకుంటూ యిల్లు చేరాడు.

పంచలో కుక్కిమంచం. ఆచార్యులవారు గోడకు తలానించి, యీజీచెయిర్ వాటంలో పడుకున్నాడు - దాహం వేసినట్టుంది. ఇంట్లోకి పోయే వోపిక లేదు. భార్యను కేకవేశాడు—“ఏయ్! యెక్కడున్నావ్ - మంచినీళ్లు కావాలి” లోపల పిల్లల యేడ్పులు - కామేశ్వరి కసురుకోవటం - ఆచార్యులవారికి వినపడుతుంది

---

అయిదు నిమిషాల్లో మా క్యాబినెట్టు అత్యవసర సమావేశంలో ఈ *Issue* మీద రాజీనామా ఇచ్చింది. మళ్లీ అప్పటికప్పుడే ఎన్నికలు జరిగాయి. కాఫీ కలవాటుపడ్డ జీవాలు, పొగకుపడిచచ్చే జీవాలు మా గృహప్రాంగణంలో వుండడంచేత, మా క్యాబినెటు మెంబర్లు ఇదివరకన్న ఎక్కువ మెజారిటీతో *Return* అయ్యారు.

ఇంతలో మునుస్వామి తిరిగొచ్చాడు. ఆర్థిక మంత్రిగారి గౌరవార్థం ఒక విందు ఏర్పాటుచేసుకున్నాము. “ప్రజాస్వామ్యానికి జై”అనే కేకలు మిన్నుముట్టాయి...

ఏమిటే నీకేకలు అని మావారు నాపల కరింపులు విని కాబోలు అడుగుతుంటే నేనేమి సమాధానం చెప్పేది మీరే చెప్పండి. ? ★



"ఏమేయ్ - నీకే చెప్పేది - గొంతెండి పోతోంది - మంచినీళ్ళు" లోపల సంచలనం - పిల్లలు కదిలిన చప్పుడు - కామేశ్వరిమాట వినపడ్డది. "నాకు పని తీర లేదు..."

ఆచార్యులవారు అతికష్టంతో లేచి యింట్లోకి రాబోయాడు. అతని నాలుగేండ్ల కుమారరత్నం - రెండుసంవత్సరాల పుత్రికామణి - వాకిట్లో అతనికి అడ్డుపడ్డారు. "నాన్నా! అమ్మకొట్టింది"... "నాన్నా-ఆ-ఆ-" పిల్లవాడి చేయిపట్టుకొని కూతురును యెత్తుకొని, యింట్లోకి బయలుదేరాడు. "నాన్నా బిస్కత్తుపెట్టవూ?" "రేపు తెస్తానులే" అంటూ మంచినీళ్లుత్రాగి కూరతరుక్కునే కామేశ్వరితో "ఏమేయ్! వాణ్ణి కొట్టావుట?"

"యేం చేయమంటారూ! ఒకటేఆగం. వెధవకు ఊష్టంగావున్నట్టుంది."

"యిదొకటా మళ్ళా, పాల్డ్రిన్ వెయ్యి - ఆ-మరచిపోయినా - చాకలి గుడ్డలు తెచ్చాడూ?"

"వాళ్ళెందుకు తెస్తారూ? మీ పిచ్చిగాకపోతే! అవసరమని చెప్పటమూ—వాళ్లు తేవడమూ యెప్పుడైనా జరిగిందా?"

"మనకు అనవసరమంటూ యెప్పుడేడ్చింది! యెప్పుడూ అవసరమే - అంటుంటివి. ఆ అవసరమంటివే యిది కూడా అని అనుకొనివుంటారు. అయితే యీ మురికిపాతలతో బీగాలపల్లి వెళ్ళాలసిందేనా?"

"అయితే నన్నేమి చేయమంటారూ?"

"కొంచెం పులిమన్నా వెయ్ చెమట గబ్బుకొట్టకుండా"

"ఇచ్చేజీతం యిస్తూ చాకలపనికూడా నేనే చేయాలా?"

"చాకలపనేకాదు. కొంచెం కుట్టుపని కూడా!"

"మరేమన్నా అనండి - ఆ తూట్లన్నీ నేను కుట్టలేను. ఆ పంచ-గోరు తగిల్తేనే చినిగేట్టుంది. కుట్టినా ప్రయోజనం లేదు-"

"పోనీ - ఆ చొక్కాయన్నా - వెధవది జోబీవద్దనే చినిగింది."

"యీపిల్లల్తో అసలే వేగలేక చస్తున్నా- ఇక మీకు కూడా అమర్చాలంటే నా ప్రాణం పోయేట్టుంది."

"సరే - యెలాగో - యేం చేస్తా మిక - నాకు ట్యూషన్ టైమయింది. లేకపోతే చాకలిమనిషికొరకు యెవరికైనా పంపుతావూ?"

"చూస్తూ అలా అంటారేమిటి? నాకేవరన్నా నవుకర్లున్నారు గనకనా? - యెవర్నన్నా పిల్లల్ని పంపించండి"

"పిల్లల్నే! యీ వూళ్ళో వుండదల్చుకుంటే ఆ మాట మాత్రం మరలా అనకు. మొన్న గురవయ్యను చితకబొడిచి పొయ్యారు, పిల్లలకి పని చెప్పవద్దని."

"అయితే మీ గవురవం మాత్రం—"

"యేమాత్రం సూదిమొనంత కూడా లేదు. బ్రతకటం యెప్పుడు బ్రహ్మాండమైన భారమైపోయిందో—గౌరవం దానంతటదే నలుసంత కూడా లేకుండా క్షీణించింది." ఈ మాట అంటూ ఆచార్యులవారు ట్యూషనుకు బయలుదేరాడు.

మరునాడు పొద్దున ఆచార్యులవారు ప్రయాణసన్నాహంలో వున్నాడు. చాకలి కూడా సమయానికి గుడ్డలు తెచ్చాడు. చొక్కాలో అక్కడక్కడా నీలిమచ్చలు కనిపించగా—కామేశ్వరి - "చూడండి - తెల్లటిగుడ్డపై యేలా మరకలు వేశారో" అంది.

"పంచకు మాత్రం లేకనా - ఇదిగో— ఏంరా చాకలీ! పంచంతా భ్రష్టు చేశావ్. బలే పనోడివే"—

"అయ్యగారు తెచ్చే పంచలన్నీ అట్టగే నాశిరకంగా వుంటయ్. అంచులు వూరకేం జేస్తాయి. అదేమంటే నామీద యేస్తారు తప్పంతా- అంతమాత్రం పంచలో తెలుపు కనబడటమే మేలనుకోండి. ఇంకొకడైతే అద్దకం వేశినట్టు చేశేవాడే."

"ఏంరో! నన్నే దద్దమ్మకింద జమ కట్టావ్. అసలు నీకీమధ్య కళ్ళు నెత్తికెక్కాయి."


"ఎక్కకేం జేస్తాయిలెండి - మీరిచ్చే రెండు రూపాయల భాగ్యానికి బలేతోమాడుతుండారే - నా లెఖ్ఖ చూసి సెటల్ జేసెయ్యండి—ఈమాట లన్నీ నేను పడేవోణ్ని కాదు"

"అది కాదులేరా-వూరికే నీవు కూడా లేనిపోని అరుస్తావు. అయ్యగారికి ప్రయాణాలకుండే పంచ అదొక్కటే- దాన్నే నీవు అంచులు వూరబెట్టుకొస్తివి."

"అదుగో,- నీవు కూడా అట్టంటే ఎట్టమ్మ - అది నాతప్పు కాదమ్మాఅంటె-"

"సరె - పోరా - ఏమిటీ లేనిపోని రచ్చ—"

ఆచార్యులవారు భార్యవైపు చూస్తూ పోతానన్నట్టు తలవూపాడు. పక్కచుట్ట చంకలో యిరికించుకొని వూరుదాటి డొంకన బయలుదేరాడు. బస్సు పొయ్యే రోడ్డు రెండుమైళ్లకు పైగా వుంది. అరగంటలో రోడ్డుకొచ్చాడు. పక్కచుట్ట చెట్టుమొదలు కొనించి మర్రిచెట్టుక్రింద కూర్చున్నాడు. అరగంట తర్వాత బస్సు వచ్చింది. అయితే దాంట్లో సీటు లేదు. రెండవబస్సులో క్రింద కూర్చొనేపనైతేనే సీటిస్తానన్నాడు కండక్టరు పంతులుగారి దీనచరిత్ర విని. ఆచార్యులవారు వొప్పుకున్నారు. పక్కచుట్టవేసి దానిపై కూర్చున్నాడు. అతని వెనుక సీటులో ఇద్దరి పిల్లలతో సహా వక మధ్యవయస్సు స్త్రీ కూర్చొనివుంది. ఆ పిల్లలు పదే పదే పంతులుగారిపై కాళ్ళు ఆనించటం ప్రారంభించారు. ఆచార్యులవారు కసరినా వాళ్లు భయపడలేదు. బడిలో అయితేనా...? ఈమారు కాలానిస్తే గిచ్చుదామనుకున్నాడు. కాని అతనికి ధైర్యంచిక్కండి కాదు. బస్సుదిగినతర్వాత చొక్కా చూసుకుంటే అర్ధచంద్రాకృతిగా ఎర్రటి మచ్చపడివుంది వీపుమీద.




అబలసుధ
స్త్రీల కుసుమ వ్యాధులు అకాల-హెచ్చు, ఋతుబద్ధము, ఋతుశూల, ఒడలునొప్పులు, తలనొప్పి, గుండెదడ కాళ్లు లాగుట, మనస్తిమితము లేకపోవుట, నిద్రపట్టకుండుట, నడుమునొప్పులు, బలహీనత, మలబద్ధము, హిస్టిరియా మొ॥ హరించును
సీసా రు. 3/- వి. పి. అ 0-14-0.
ఇండియన్ మెడిసన్ హౌస్,
లక్ష్మి టాకీసు రోడ్డు - విజయవాడ-2.

బీగాలపల్లెకు మరల నడక సాగించాడు. కడుపులో ఆకలి దహించుకుపోతోంది. ప్రొద్దు నెత్తిమీద కొచ్చింది. యెండ చుర్రుమంటోంది దురదృష్టవశాత్తు చెప్పు గూడు తెగింది. ఒక చేత్తో పక్కచుట్టా - రెండవచేత్తో చెప్పులు. ఆచార్యులవారు మహాభారంతో నడకసాగించారు. ఒంటి గంటకు బీగాలపల్లికి చేరాడు. గమిట్లో వున్న యింటికెళ్ళి ఒక చెంబెడు మంచినీళ్లు త్రాగి - పోలింగ్ స్టేషను వెతుక్కుంటూ వెళ్ళాడు. P. O గారు అప్పుడే భోంచేసి సీళ్ళపాకెట్లు విప్పుతున్నాడు. ఆచార్యుల వారు తనను పి. ఓ గార్కి యెరుకపరచు కొన్నారు. ఆవూరి మునసబు ఒక యింట్లో భోజనంయేర్పాట్లు చేశాడనీపూటకు0-12-0 లు అని కూడా పంతులుగార్కి తెలిసింది. ఆయింటిజాడ తెలుసుకుని వెళ్లాడు. కూరలు లేవట. ఒక్కపులుసు మాత్రమే వుంది. ఆచార్యులవారు పులుసుతోను - మజ్జిగ తోను రెండుముద్దలు మింగి పంచ్రెణ్ణాలు సమర్పించి తనకు తిండిపెట్టినందుకు కృతజ్ఞత తెలిపాడు.

పి. ఓ. గారు ఎ. పి. ఓ, లను పోలింగ్ గుమస్తాలను సమావేశపరచి-పోలింగ్ నాడు యెవరెవరు — యే - యే - పనులు చేయవలెనో చెప్పి - యిద్దరు ఎ. పి. ఓ. లకు చెరిసగంగా పనిని పంచిపెట్టాడు. పంతులుగారు తన ఎ. పి. ఒ తోను, యింకొక గుమాస్తాతోనూ తన వాటా బాలెట్ పెట్టెలు - యితర కాగితాలతోను విడివడి-కాగితాలు పెట్టెలకు కరిపించటం వగైరా పనులను చేశారు. రాత్రి 10 గంటలకు పని పూర్తయింది.

భోజనాలయినాయ్. బూతుల్లోనే బెంచీలపై పక్కలుపరచుకొని పడుకున్నారు. ఆచార్యులవారికి సన్నటి యిరుకైన బెంచీ దొరికింది. యేలాగో పండుకొని నిద్రకోసం పెనగులాడుతున్నాడు. ఒక 2 నిమిషాలు గడిస్తే వారికీ ఆపద కలిగేదికాదు. కానీ దురదృష్టం - రెండు W. P రైలు యింజన్లు ఒక్కసారిగా అరిస్తే యెలాంటి భయంకరశబ్దము వస్తుందో - అలాంటి శబ్దమే వినపడింది. పంతులుగారు త్రుళ్ళిపడ్డారు. ఇతరులకు కూడా తాత్కాలికంగా నిద్రాభంగమైంది. కానీ వారు మరుక్షణంలో నిద్రపోయారు. ఆచార్యులవార్కిమాత్రం ఆ అదృష్టం పట్టలేదు. యీ భయంకరనాదం యెందువల్ల వుత్పత్తి అయిందో - కాస్త పరికించి చూచాడు. అది తనప్రక్కనవుండే మహాశయుడు పెట్టే గురకయని — అది తెల్లవారిందాకా తన నిద్రే వేధించగలదని-తలచి పంతులుగారు తల్లడిల్లిపోయారు. ఆ మహా ఆపదనుండి తప్పించుకొనే వుపాయం అతనికి యేమాత్రం కనపడలేదు. లేచి కూర్చుని ఒక బీడీ ముట్టించి - అగ్గిపుల్ల వెలుతురులో పక్కనున్న మహాకాయాన్ని వీక్షించాడు. తట్టిలేపుదామా...బిడియంతో ఆ ప్రయత్నం మానుకున్నాడు. ఇంకెక్కడన్నా యీ భయంకరశబ్దము వినబడని సురక్షిత ప్రదేశాన్ని వెతకటానికి ప్రయత్నించాలనుకున్నాడు. గడియారం టిక్కుటిక్కుమంటూ చిన్నముల్లును పకటిపై చూపిస్తోంది. టవలు మెడకు గట్టిగా చుట్టుకొని—పక్కమీదనుంచి లేచి - తలుపు తీశాడు. రివ్వుమంటూ చలిగాలి వీస్తోంది. దూరాన కుక్కలు మొరుగుతున్నాయ్. బయట పంచలో వెట్టివాళ్ళు పండుకొనివున్నారు. పంతులుగారు తలుపు ముందుకు లాగాడు. గురక వినబడుతుందా—? వినబడుతూవుంది. అయితే రైళ్ళు ఢీకొన్నట్టుకాదు. పందికొక్కులు ఘర్షణపడ్డట్టు - పంచలో సాధ్యమైనంత దూరంపోయాడు. పర్వాలేదు. యిక్కడ పడుకోవచ్చు. కాని చలి - అతనికో ఆలోచనతట్టింది. లోపలికి పోయి బోర్డు తెచ్చి గుంజ కానించాడు. పక్క పరుచుకొని — నిద్రకుపూనుకున్నాడు.

ఆచార్యులవారికి మెలకువ వచ్చేటప్పటికి - వక పెట్రోమాక్సు లైటు - నాలుగైదు హరికేనులాంతర్లు, అయిదారుగురు మనుష్యులు అతనిచుట్టు వున్నారు. తన చుట్టూ యింత హడావిడి. పంతులుగారు పక్కమీద ఎగిరి కూర్చున్నాడు.

"లేవయ్యా పంతులూ, ఆరు కావస్తుంటే" ఆచార్యులవారు స్థిమితపడ్డారు. తాపీగా వారు పక్క చుట్టుకుంటూ వుండగా పి. ఓ. గారి మాట వినవచ్చింది. "బూతుల్లోకి వెళ్లండి. సీల్సు అవి తీసుకొని. ఆ. ఎ. పి. ఒ దగ్గరవుంటుంది."

ఆచార్యులవారు ముఖం కడగటం వగైరా కార్యక్రమాలను వక పది నిమిషాల్లో నెరవేర్చుకొని బూతులోకి వెళ్లాడు. సీళ్లువేయడం, బ్యాలెటుపెట్టెలు అమర్చటంతో ఏడయింది.

అప్పటికే తండోపతండాలుగా వోటర్లు వచ్చారు. పోలీసుల ధర్మాన క్యూలో నిలబడి పెనగులాడుతున్నారు. పోలింగు ప్రారంభమైంది. కాని వక చిక్కు...లోపలికి పోయినవారు ఎంతకీ బైటకీ రారు. బాలెటుపేపరు యిచ్చేప్పుడు త్వరగా రమ్మని వారితో చెప్పాలి. త్వరగా రమ్మని హెచ్చరిక - తర్వాత— ఏంజేస్తున్నావ్ లోపల. త్వరగా వేశిరండి-అని కేకలు - రెండు నిమిషాలు గడుస్తాయి. అప్పటికీ వోటర్లు రారు. ఇక లోపలికి పోయి వారిని బయటకు తీసుకరావాలి. ఏకొద్దిమందినో మినహాయిస్తే - మిగతావారితో యిదే గోల. మధ్యాహ్నానికి నూటపాతిక కూడా ఆచార్యులవారిబూతులో పోలు గాలేదు. క్యూలో నిలబడ్డ వోటర్లు అసెంబ్లీ క్లర్కైన మన పంతులుగారినే శాపనార్థాలు పెట్టారు. పాపం. చుట్టుప్రక్కల గ్రామాలనుంచి - వేకువనే - గంజినీళ్లైనా త్రాగకుండా బయలుదేరివచ్చి మధ్యాహ్నందాకా క్యూలో - నెత్తి కాలుతుండగా కడుపు మాడుతుండగా - నిలబడ్డ వోటర్లు ఆచార్యులవారు పోలింగ్ స్టాప్ చేసి భోజనానికి పోతుంటె - తిట్లవర్షం కురిపించటం ఏమంత అసహజంగా లేదు. కాని ఆచార్యులవారికి వోటర్లమీద పట్టరాని కోపం వచ్చింది. గుంపుమీద విరుచుక పడదామా? అనుకున్నాడు. అయితే అతనిలోని భీరుత్వం వెనక్కులాగడంతో-"బడిలో అయితేనా" అని అనుకుంటూ - ఛీత్కారంగా - అగ్గిపుల్లను బర్‌మని గీచి బీడి ముట్టించి పూటకూళ్లయింటికెళ్ళాడు.

అయిదుగంటలకు పోలింగు పూర్తయినా రాత్రి పదకొండుగంటలదాకా యితర చాకిరి చెయ్యాల్సివచ్చింది. లెఖ్ఖలు—ఫారాలభర్తి - కవర్లు కుట్టడం - సీళ్లు - వగైరా - వగైరా...

ఆచార్యులవారికి రాత్రి అన్నంసహించలేదు. పొద్దుపోయింది. అన్నం నీళ్లు కారుతూవుంది. చారు పోసుకొని రెండు ముద్దలు మింగాడు. ఈరోజుమాత్రం పక్క వేసుకోటంలో మొదటనే జాగ్రత పడ్డాడు.

మరునాడు బస్సు ప్రయాణంలో పడరానిపాట్లుపడి—యింటికి వచ్చాడు. కామేశ్వరి బియ్యంలేక రాత్రిటి నుంచి పస్తని, పిల్లవానికి ఉష్టం ఏమాత్రం తగ్గలేదని విన్నవించింది. పిల్లలు నాన్న నాన్న అంటూ చుట్టుకున్నారు. అప్పుడే మధ్యాహ్నం వంటిగంటయింది. పక్కచుట్ట దూరంగా విసరి - శోషవస్తున్నా - నెమ్మదిగా కాళ్లీడ్చుకుంటూ - బియ్యం కోసం ఆచార్యులవారు వూరిమీదకు పోయాడు. ★


## నారసింహ లేహ్యము




బంగారు చేర్చబడినది. మేహము, నిర్వీర్యము, నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 12 అ.

పి. సి. ఏ. & కంపెని, "ఆయుర్వేదసమాజం"

పెరిదేపి- నెల్లూరు జిల్లా.